సాక్షి అనకాపల్లి

గురువారం । 2 । అక్టోబర్ । 2025





జయజయహే మహిషాసుర మర్దిని

అమ్మలగన్న అమ్మ.. దుర్గమ్మ శరన్నవ రాత్రి ఉత్సవాలు ముగింపునకు చేరుకున్నాయి. మహర్నవమి వేళ అమ్మవారు మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. అమ్మవార్ల ఆలయాల్లో మహిళలు, మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు. మరోవైపు విజయదశమి సంబరాలు ఆరంభమయ్యాయి. విజయాన్ని శుభాన్ని అందించే విజయదశమి పండగను వైభవంగా జరుపుకొనేందుకు జిల్లా ప్రజలు సర్వం సిద్ధం చేశారు. కొనుగోళ్లతో మార్కెట్ కిటకిటలాడింది. జీఎస్టీ తగ్గింపుతో ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ షాపుల వద్ద రద్దీ విపరీతంగా ఉంది.

–సాక్షి నెట్‌వర్క్


మహిషాసుర మర్దినిగా అనకాపల్లి సతకంపట్టు కనకదుర్గమ్మవారు


అనకాపల్లిలో కన్యకాపరమేశ్వరి అమ్మవారికి లక్ష బాదం పలుకులతో పూజ


ప్రత్యేక అలంకరణలో యలమంచిలి పెంజెరువు కనకదుర్గమ్మవారు


నూకాంబిక అమ్మవారి ఆలయంలో ఊంజల్ సేవ


అనకాపల్లిలో ఆటోమొబైల్ షోరూంలో సందడి


ఎలక్ట్రానిక్ షోరూంలో కోలాహలం



పెన్సిల్ ముల్లుపై దుర్గమ్మ

మాడుగుల రూరల్: విజయదశమిని పురస్కరించుకొని సూక్ష్మ కళాకారుడు నెయ్యిదొండ గోపాల్ పెన్సిల్ ముల్లు మీద రాజరాజేశ్వరి అమ్మవారిని చెక్కారు.

నేడు అప్పన్న జమ్మివేట

శమీ పూజ అనంతరం అశ్వవాహనంపై తిరువీధి


రామాలంకారంలో అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి (ఫైల్)


పూలతోట వ్యూ

సింహాచలం: విజయదశమిని పురస్కరించుకుని గురువారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జమ్మివేట ఉత్సవం జరగనుంది. కొండదిగువ పూలతోటలో జరిగే ఈ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి రామాలంకారం చేసి మధ్యాహ్నం 3.30 గంటలకు సింహగిరి నుంచి కొండదిగువకు మెట్లమార్గంలో తీసుకెళ్తారు. కొండదిగువ పూలతోటలో ఉన్న మండపంలో స్వామిని వేంజేయించి విశేషంగా పూజలు నిర్వహిస్తారు. పూలతోటలోనే ఉన్న జమ్మిచెట్టు వద్ద శమీపూజ నిర్వహిస్తారు. తదుపరి, స్వామికి అడవివరం గ్రామ పురవీధుల్లో అశ్వవాహనంపై తిరువీధి నిర్వహిస్తారు. పెద్ద ఎత్తున విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. గోపాలపట్నం పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. జమ్మివేట ఉత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం 6 గంటల వరకు సింహగిరిపై స్వామివారి మూలవిరాట్ దర్శనాలు లభిస్తాయి. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు పూలతోటను పెద్ద ఎత్తున ముస్తాబు చేశారు.

రేపటి నుంచి మూడో విడత రీసర్వే

కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: జిల్లాలో మూడో విడత రీసర్వేను ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 54 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, మొదటి విడత 24 గ్రామాలు, రెండో విడతలో 30 గ్రామాల్లో రీసర్వే జరిగిందని తెలిపారు. ప్రస్తుతం చేపట్టే మూడో విడత రీసర్వే అనకాపల్లి డివిజన్‌లో 15 గ్రామాలు, నర్సీపట్నం డివిజన్‌లో 15 గ్రామాలలో జరుగుతుందన్నారు. మొత్తం 30 గ్రామాలలో గ్రామ సరిహద్దులు నిర్ణయించడం జరిగిందని, పట్టా భూముల సర్వే ప్రారంభిస్తామని, భూ ఆసాములు, గ్రామస్తులు రీ సర్వేకు హాజరై రెవెన్యూ, సర్వే అధికారులకు సహకరించాలని ఆమె పేర్కొన్నారు.

విజయదశమి శుభాకాంక్షలు

ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, అన్నింటిలో విజయాలు సాధిస్తూ ముందుకు సాగాలని కలెక్టర్ విజయ కృష్ణన్ బుధవారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల జీవితాలు, ఆలోచనల్లో మార్పు రావాలని, కనకదుర్గ అందరికీ మంచి చేకూర్చాలని ఆమె ఆకాంక్షించారు.

భారీ వర్ష సూచన


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా

జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

తుమ్మపాల: వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు రానున్న మూడు రోజులలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ఆమె మండల అధికారులతో కలెక్టరేట్ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమెతోపాటు ఎస్పీ తుహిన్ సిన్హా, జేసీ జాహ్నవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ అంతరాయం ఏర్పడితే ఒకటి, రెండు గంటలలో సరిచేయాలని, రోడ్లపై చెట్లు పడిపోతే వాటిని వెంటనే తొలగించి రాకపోకలను పునరుద్ధరించాలని చెప్పారు. రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ, సాగునీటి పారుదల శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జలాశయాలలో పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం పాటించాలని, ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జలాశయాలు, చెరువులు ఆక్రమణలకు గురి కాకుండా రక్షణ కల్పించవలసిన బాధ్యత నీటి పారుదల శాఖ అధికారులదేనన్నారు.

నిమజ్జనాల్లో జాగ్రత్త

దసరా ఉత్సవాలు పూర్తికానున్న నేపథ్యంలో అమ్మవారి విగ్రహాల నిమజ్జనాలు ప్రశాంతంగా, ఎటువంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా జరిగేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తీరప్రాంత మండల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గజ ఈతగాళ్లను నియమించాలని, బోట్లను సిద్ధం చేసుకోవాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. డీఆర్వో వై.సత్యనారాయణరావు, ఆర్డీవో షేక్ ఆయిషా, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ-చర్లపల్లి-విశాఖ దసరా స్పెషల్

తాటిచెట్లపాలెం: దసరా సందర్భంగా ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు విశాఖపట్నం-చర్లపల్లి- విశాఖపట్నం మధ్య స్పెషల్ రైలును నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖ-చర్లపల్లి(08589) స్పెషల్ ఈనెల 3 రాత్రి 7.30 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. చర్లపల్లి-విశాఖ(08590) స్పెషల్ ఈనెల 4న రాత్రి 8 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 11.45 గంటలకు విశాఖ చేరుకుంటుంది.

అప్పన్న సన్నిధిలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి



2లో

- మెడికల్ కళాశాలపై అయ్యన్న కొత్త రాగం
- తొలుత ప్రారంభ దశలోనే ఉందంటూ ఐటీడీపీ ద్వారా తప్పుడు ప్రచారం
- ప్రజా వ్యతిరేకత రావడంతో.. అసలు జీవోనే లేదంటూ కొత్త వాదన
- అయ్యన్న వ్యాఖ్యలను చీదరించుకుంటున్న ప్రజలు


భీమబోయినపాలెంలో దాదాపు పూర్తయిన మెడికల్ కాలేజీ భవనం

రోజుకో మాట.. పూటకో అబద్ధం

మెడికల్ కాలేజీ జీవో ఉందా.. లేదండీ .. ఉత్తిదే.. ఆర్డరే లేదు. రమ్మను దమ్ముంటే ఎవరినైనా రమ్మను.. ఏమన్నా అంటే అయ్యన్నపాత్రుడు ఆహేశాడంటారు. కేంద్ర ప్రభుత్వం ఆర్డర్ ఇవ్వాలి. రైతుల దగ్గర భూములు తీసేసుకుని ఇష్టానుసారంగా కట్టేసి ఆపేస్తే ఎలా..? ఆర్డర్ లేకుండా మెడికల్ కాలేజీ కడతారా ? పిల్లలను జాయిన్ చేసుకుంటారా ? ఐదేళ్ల తర్వాత వారి బతుకులు ఏమైపోతాయి. దమ్ముంటే భీమబోయినపాలెం వచ్చి ఆర్డర్ చూపించాలి. తప్పుడు ప్రచారం చేయకూడదు. ప్రజలను మభ్యపెట్టకూడదు. చేతకాకపోతే చేయలేమని చెప్పాలి..

మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో బుధవారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్న మాటలివి..

2019–24 మధ్య కేంద్ర ప్రభుత్వం ద్వారా అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలకు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. మరి ఆనాటి ప్రభుత్వంలో కేవలం 7 మాత్రమే పూర్తయ్యాయి. చిన్న చిన్న ఇబ్బందులున్నా పూర్తి చేశారు. మిగిలిన 10 మెడికల్ కళాశాలను పీపీపీ పద్ధతిలో నిర్మించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

ఇవి ఇటీవల కేబినెట్ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పార్థసారథి అన్న మాటలు

సాక్షి, అనకాపల్లి:

కొద్ది రోజుల క్రితం మంత్రి పార్థసారథి చెప్పిన మాటలకు.. తాజాగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు దబాయింపునకు ఎంత వ్యత్యాసం ఉందో చూడండి. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన 'జిల్లాకో ప్రభుత్వ మెడికల్ కళాశాల' సంకల్పాన్ని చులకన చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. నిర్మాణం పూర్తి కావచ్చిన భవనాలు ప్రారంభ దశలోనే ఉన్నాయంటూ తొలుత బొంకిన ప్రభుత్వ పెద్దలు.. ప్రజా వ్యతిరేకత రావడంతో అసలు జీవోనే లేదంటూ కొత్త వాదన మొదలుపెట్టారు. కళ్ల ముందున్న వాస్తవాలను గమనిస్తున్న ప్రజలు సర్కారు రెండు నాల్కల ధోరణిని చీదరించుకుంటున్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు బుధవారం మాట్లాడుతూ అసలు జీవోనే లేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో రూ.500 కోట్లతో మెడికల్ కాలేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 50 ఎకరాల్లో 13.21 లక్షల చదరపు అడుగుల్లో చేపట్టిన నిర్మాణాలను 60 శాతానికి పైగా పూర్తి చేసింది. వైఎస్సార్ సీపీ హయాంలో నిర్మాణాలు ప్రారంభ దశలోనే ఉన్నాయంటూ ఐటీడీపీ ద్వారా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారు. దీనికి దీటుగా వైఎస్సార్‌సీపీ నాయకులు మెడికల్ కళాశాల సందర్శన పేరిట మీడియా ద్వారా నిర్మాణపనులు ఎంతమేర అయ్యాయో నిరూపించారు. ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు బుధవారం భీమబోయిన పాలెంలో పింఛను పంపిణీ కార్యక్రమంలో అసలు జీవో లేదంటూ సరికొత్త రాగం అందుకున్నారు. కానీ ప్రజలు అమాయకులు కాదు.. కళ్ల ముందున్న వాస్తవాలను గ్రహించకపోరు.

ఏయూ దూర విద్య.. అక్రమాల అడ్డా

- ప్రైవేటుకు ఏయూ పరీక్షా కేంద్రాలు
- ఇష్టానుసారంగా కేంద్రాల మంజూరు
- ఒక్కో సెంటర్ నుంచి రూ.2 నుంచి రూ.5 లక్షల వసూలు
- కర్నూలు, నంద్యాలలో అక్రమంగా పరీక్షా సెంటర్ల నిర్వహణ
- మాస్ కాపీయింగ్‌కు అడ్డాగా ఏయూ దూర విద్య



ఏయూ దూర విద్యా కేంద్రం

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వ విద్యాలయం దూర విద్యకు చెదలు పట్టింది. అధికారుల హస్తలాఘవానికి కేంద్రంగా మారిపోయింది. పరీక్షా కేంద్రాల పేరుతో అక్రమాలకు అడ్డాగా తయారైంది. ఏయూ దూర విద్య పరీక్షా కేంద్రాల వ్యవహారం ఇపుడు హాట్ టాపిక్‌గా మారింది. అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది చేతివాటం కారణంగా ఎగ్జామినేషన్ సెంటర్లు హద్దులు దాటి ప్రైవేటు చేతికి వెళ్లిపోయాయి. ఈ ప్రైవేటు సెంటర్లు ఒక పేరుతో అనుమతి పొంది మరోచోట పరీక్షలు నిర్వహిస్తున్నా.. అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ప్రధానంగా ఈ పరీక్షల నిర్వహణపై కూడా అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అనధికార కేంద్రాలు మాస్ కాపీయింగ్‌కు నిలయాలుగా మారిపోయాయి. ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే దూర విద్య పరీక్షా కేంద్రాలు నిర్వహించాలని ఏయూ పాలకులు నిర్ణయం తీసుకున్నప్పటికీ.. కొన్ని లొసుగులతో ఇప్పటికీ ప్రైవేటుకే పెద్దపీట వేస్తున్నారు.

సెంటర్‌కు రూ.2 నుంచి రూ.5 లక్షలు

ఏయూ పరీక్షా కేంద్రాలను ఇష్టానుసారంగా ప్రైవేటుకు అప్పగించేశారు. ప్రైవేటు సెంటర్లలో మాస్ కాపీయింగ్ జరిగిన సందర్భాలు అనేకమున్నాయి. అయినప్పటికీ పరిధి దాటి అనంతపురం, కర్నూలు, నంద్యాల, హైదరాబాద్‌లలో కూడా ప్రైవేటు విద్యా కేంద్రాలకు పరీక్షా కేంద్రాల నిర్వహణకు అనుమతులు మంజూరు చేసేశారు. ఇటువంటి సెంటర్లపై ఎన్ని ఫిర్యాదు వచ్చినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రతి సెంటర్ నుంచి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు తీసుకుని అనుమతులు మంజూరు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ తర్వాత వాటి పర్యవేక్షణ మాత్రం గాలికి వదిలేస్తున్నారు.

ప్రైవేటు కేంద్రాలు రద్దు చేయాలని నిర్ణయించినా..

ఏయూ దూర విద్య పరీక్షల నిర్వహణపై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ప్రైవేటు పరీక్షా కేంద్రాల అనుమతులు రద్దు చేయాలని రెండేళ్ల క్రితమే ఏయూ అధికారులు నిర్ణయించారు. కేవలం ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే ఈ పరీక్షలను నిర్వహించాలని భావించారు. కానీ అధికారుల బదిలీలు.. సిబ్బంది చేతివాటం.. ప్రైవేటు మామూళ్లతో ఇప్పటి వరకు ఆ నిర్ణయాన్ని అమలు చేయలేదు. ఇప్పటికీ ఆంధ్రాలోనే కాకుండా తెలంగాణలో కూడా ఏయూ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ పరీక్షలు ప్రైవేటు సెంటర్లలో నిర్వహిస్తూనే ఉన్నారు. గత నిర్ణయాలను మాత్రం అమలు చేయడానికి వెనకడుగు వేస్తున్నారు. ఆదాయం పోతుందన్న కారణంగానే ప్రైవేటు సెంటర్లను ప్రోత్సహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మాస్ కాపీయింగ్‌కు కేంద్రాలుగా...

ఏయూ దూర విద్య పరీక్షా కేంద్రాలుగా ఉన్న కొన్ని ప్రైవేటు సెంటర్లు అనధికారికంగా మరి కొన్ని చోట్ల ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రత్యేకంగా పరీక్షా కేంద్రాలను నిర్వహించి అక్కడ విద్యార్థులతో పరీక్షలు రాయించి వాటిని అనుమతి పొందిన కేంద్రాల్లో నిర్వహించినట్లు చూపిస్తున్నారన్న వార్తలు గుప్పుమంటున్నాయి. గత నెల 12వ తేదీ కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఇదే తరహాలో అనధికారికంగా పరీక్షలు నిర్వహించినట్లు సమాచారం. మరికొంత మంది ఇతర జిల్లాల్లో అనధికారికంగా పరీక్షలు రాయించి ఉత్తరాంధ్రలో ప్రభుత్వ విద్యా సంస్థలో ఉన్న కేంద్రాల్లో పరీక్షలు రాసినట్లు చూపిస్తున్నారని, ఇందుకు దూర విద్యా విభాగం సిబ్బంది కూడా సహాయ సహకారాలు అందిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

వైద్యుల సమ్మె నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

- డీఎంహెచ్‌వో డా.హైమావతి


కశింకోట పీహెచ్‌సీలో వృద్ధులకు సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో హైమావతి

కశింకోట: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయంగా వైద్యులను నియమించినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.హైమావతి తెలిపారు. కశింకోట పీహెచ్‌సీని బుధవారం ఆమె సందర్శించి, వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కశింకోట పీహెచ్‌సీలో అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు మానసను తాత్కాలికంగా నియమించామని, ప్రజలు ఇబ్బంది పడకుండా వైద్యుల సేవలను వినియోగించుకోవాలని కోరారు. అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వృద్ధులతో సమావేశమై ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధానమంత్రి వయో వందన కార్డును 70 ఏళ్లు నిండినవారు పొందాలన్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రికి అత్యవసర కేసులు

అనకాపల్లి: పీహెచ్‌సీ వైద్యుల సమ్మె నేపథ్యంలో అత్యవసర కేసులను ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించాలని జిల్లా యూనివర్సల్ ఇమ్యూనైజేషన్ (స్టేటిస్టికల్) అధికారి రామచంద్రరావు వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన బుధవారం తరగంపూడి పీహెచ్‌సీని సందర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు.

మారిన జీఎస్టీ ప్రకారం బిల్లులు ఇవ్వాలి


వర్తకులను ఉద్దేశించి మాట్లాడుతున్న లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ అనురాధ

నర్సీపట్నం: ప్రభుత్వం జీఎస్టీ భారాన్ని తగ్గించిందని, అందుకు అనుగుణంగా ధరలు తగ్గించి, వ్యాపారులు బిల్లు ఇవ్వాలని నర్సీపట్నం లీటల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ డి.అనురాధ అన్నారు. మండలంలో వేములపూడి గ్రామంలో బుధవారం వర్తకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారిన జీఎస్టీ స్లాబ్‌లకు అనుగుణంగా బిల్లింగ్ సాఫ్ట్‌వేర్‌ను మార్పు చేసుకోవాలన్నారు. ఎవరైనా అధిక ధరలకు అమ్మినట్టు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నర్సీపట్నంలోని ఒకరిద్దరు హోల్‌సేల్ వ్యాపారస్తుల వద్ద నిత్యావసర వస్తువులు కొనుగోలు చేస్తున్నామని, మారిన జీఎస్టీతో కొన్న వాటికి బిల్లు అడిగినప్పటికీ ఇవ్వటం లేదని రిటైల్ వ్యాపారులు అధికారి దృష్టికి తీసుకువెళ్లారు. హోల్‌సేల్, సూపర్ మార్కెట్, రిటైల్ వర్తకులు ఎవరైనా అమ్మిన ప్రతి వస్తువుకు మారిన జీఎస్టీ స్లాబ్‌ల ప్రకారం బిల్లు ఇవ్వాలని ఆమె స్పష్టం చేశారు. ఎవరైనా అధిక ధరలకు అమ్మితే వెంటనే ఫిర్యాదు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

'పెద్దేరు' నుంచి 200 క్యూసెక్కుల నీరు విడుదల



జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

మాడుగుల రూరల్: పెద్దేరు జలాశయం నుంచి 200 క్యూసెక్కుల నీటిని స్పిల్‌వే గేట్ల ద్వారా దిగువకు విడుదల చేసినట్లు జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 137 మీటర్లు కాగా, ప్రస్తుతం 136.60 మీటర్లకు చేరిందని పేర్కొన్నారు. కురుస్తున్న వర్షాలకు జలాశయంలోకి 245 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందని ఆయన తెలిపారు.

విజయవాడలో రేపు వైద్యుల ఆమరణ నిరాహార దీక్ష



ఎన్టీఆర్ ఆస్పత్రి వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా చేపడుతున్న పీహెచ్‌సీ వైద్యులు

అనకాపల్లి: తమ సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, శుక్రవారం విజయవాడలో రాష్ట్ర వ్యాప్తంగా పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు ఆమరణ నిరాహార దీక్ష చేసేందుకు సిద్ధమైనట్టు ఏపీ ప్రైమరీ హెల్త్ వైద్యుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఎస్తేర్ రాణీ, ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి వద్ద బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అక్కడి నుంచి ఎన్టీఆర్ క్రీడా మైదానం వరకూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది పీహెచ్‌సీ వైద్యుల సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ నేటి వరకూ అమలు చేయకపోవడం దారుణమన్నారు. సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వి.సునీల్‌కుమార్, వాణిజగదీశ్వరీ, వినోద్, వెంకటేష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా ఎర

- పెదగాడిలో యూరియా రగడ
- జీఎస్టీ ప్రచారానికి వస్తే యూరియా ఇస్తామన్న కూటమి నాయకులు
- అనంతరం యూరియా ఇవ్వకుండా వెనక్కి పంపిన వైనం
- అధికారులు, నాయకుల తీరుపై మండిపడ్డ మొగలిపురం రైతులు

పెందుర్తి: అధికార కూటమి నాయకులు ప్రచార యావతో యూరియాను ఎరగా చూపించి మోసం చేయడంతో ఒక గ్రామానికి చెందిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంపై అవగాహన సదస్సు కోసం బుధవారం పెందుర్తి మండలం పెదగాడి రైతు సేవా కేంద్రం వద్ద చేపట్టిన కార్యక్రమంలో ఈ వివాదం చోటు చేసుకుంది. కూటమి ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై అవగాహన సదస్సు, ర్యాలీ కోసం పెదగాడి, పినగాడితో పాటు, పినగాడి రెవెన్యూ పరిధిలో భూములు ఉన్న సబ్బవరం మండలం మొగలిపురానికి చెందిన రైతులను కూటమి నాయకులు ఆహ్వానించారు. సదస్సు, ర్యాలీకి వచ్చిన ప్రతీ రైతుకు యూరియా ఇస్తామని నాయకులు నమ్మబలికారు. అసలే యూరియా కొరతతో ఇబ్బంది పడుతున్న మొగలిపురం రైతులు, ఈ హామీతో సదస్సుకు ఉత్సాహంగా హాజరయ్యారు.

తీరా జీఎస్టీపై ప్రచారం పూర్తయిన తరువాత, పెదగాడికి చెందిన కూటమి నాయకులు తమకు నచ్చిన కొందరి పేర్లను అధికారులకు చెప్పి, వారికి మాత్రమే యూరియా ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో మొగలిపురం రైతులకు పెదగాడి క్లస్టర్‌లో యూరియా ఇవ్వలేమని అధికారులు తేల్చిచెప్పారు.



పెదగాడి రైతు కేంద్రం యూరియా కోసం వద్ద వ్యవసాయాధికారులకు, రైతుల మధ్య వాగ్వాదం

రైతులు..అధికారుల మధ్య వాగ్వాదం

దీంతో రైతులు, అధికారుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. మండలం పరంగా సబ్బవరం అయినప్పటికీ, తమ భూములు పినగాడి రెవెన్యూలోనే ఉన్నాయని రైతులు వివరించారు. పినగాడి రెవెన్యూ పరిధిలో ఉన్నవారికి ఇస్తామని చెప్పి, అదే ప్రాంతంలో భూములు ఉన్న తమకు ఎరువు ఇవ్వకపోవడమేంటని నిలదీశారు. అదే సమయంలో యూరియా నిల్వలు కూడా అయిపోవడంతో చేసేది లేక, కూటమి నాయకుల తీరుపై తీవ్రంగా మండిపడుతూ మొగలిపురం రైతులు వెనుదిరిగారు. 'యూరియా సరిపడా అందించడంలో విఫలమై, చివరకు చిన్నపాటి ప్రచారానికి మాయమాటలు చెప్పి మమ్మల్ని తరలించారు. ఇలా ఉసూరుమనిపించడం తగదు' అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని వారు స్పష్టం చేశారు.



వ్యవసాయాధికారులను నిలదీస్తున్న రైతులు

మెడికల్ షాపుల్లో తనిఖీలు

- 43 షాపుల పరిశీలన
- జీఎస్టీ అమలు చేయని వారిపై కఠిన చర్యలు
- అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్ హెచ్చరిక

మహారాణిపేట: జీఎస్టీ తగ్గింపు ధరలను మెడికల్ షాపులు ఎక్కడా అమలు చేయకపోవడంపై ఔషధ నియంత్రణ శాఖ అధికారులు స్పందించారు. జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. విజయకుమార్ ఆధ్వర్యంలో బుధవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని మెడికల్ షాపులపై విస్తృత తనిఖీలు నిర్వహించారు. మహారాణిపేట, మధురవాడ, ఎంవీపీ కాలనీ, ఆరిలోవ, గాజువాక, చిన్నగంట్యాడ, కుర్మన్నపాలెం, అనకాపల్లి, కశింకోట వంటి ప్రాంతాల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు దాడులు చేశారు. మొత్తం 43 మెడికల్ షాపులలో తనిఖీలు చేపట్టారు. సాక్షిలో కథనం రాగానే కొన్ని షాపులు జీఎస్టీ తగ్గింపు ధరలను తెలియజేసే సైన్ బోర్డులను ప్రదర్శించాయి. అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్ స్వయంగా పెదవాల్తేరు, చిన్నవాల్తేరు ఏరియాల్లోని 11 షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ షాపుల్లో ఎక్కడా జీఎస్టీ ధరల బోర్డులు ఏర్పాటు చేయకపోవడాన్ని గమనించారు. తక్షణమే బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన డ్రగ్గిస్టులను ఆదేశించారు. జీఎస్టీ నిబంధనలతో మాత్రమే మందులను విక్రయించాలని మెడికల్ షాపుల యజమానులను ఆదేశించారు. మందులను కొనుగోలు చేసినప్పుడు వినియోగదారులు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా జీఎస్టీ సైన్ బోర్డులు లేకపోయినా, జీఎస్టీ తగ్గింపు ధరలకు అమ్మకాలు జరగకపోయినా డీఆర్‌సీ నంబర్ 863233 0909కు గాని, లేదా dca-grams@ap.gov.inకు ఫిర్యాదు చేయాలని కోరారు.



మెడికల్ షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

అమర్‌ను కలిసిన రాజయ్యపేట మత్స్యకారులు

నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా రాజయ్యపేటలో చేపట్టిన దీక్షకు మద్దతు తెలపాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను మత్స్యకారులు కోరారు. ఈ మేరకు బుధవారం నక్కపల్లి మండలం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సీరం నర్సింగమూర్తి, ఉపాధ్యక్షుడు నాగేష్ ఆధ్వర్యంలో రాజయ్యపేట మత్స్యకార సంఘం పెద్దలు.. అమర్‌నాథ్‌ను గాజువాక సమీపంలో



అమర్‌నాథ్‌ను కలిసి దీక్షకు మద్దతు ఇవ్వాలని కోరుతున్న మత్స్యకార నాయకులు

మందిలో కలిసి వినతి పత్రం అందజేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని కోరారు.

నిరాహార దీక్షకు మద్దతు

రాజయ్యపేటలో మత్స్యకారుల దీక్షకు 33 గ్రామాల సంఘాల అధ్యక్షుడు చొక్కా అప్పారావు మద్దతు ప్రకటించారు. బుధవారం శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ వెంటనే ప్రభుత్వం స్పందించి బల్క్ డ్రగ్స్ పార్కును రద్దు చేయకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 33 సంఘాల నాయకులు యజ్జల సూరిబాబు, యజ్జల రాజు, బోదిన నాగేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, నాయకులు పిక్కి తాతీలు, గోసల సోమేశ్వరరావు, చొక్కా కాశీ, చేపల సోమేష్, ఎం.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కన్‌స్ట్రక్షన్ కంపెనీకి వినియోగదారుల కమిషన్ షాక్

విశాఖ లీగల్: విశాఖ లీగల్: వినియోగదారుడికి సేవా లోపం కలిగించినందుకు పరిహారం చెల్లించాలని నగరంలో వినియోగదారుల పరిష్కార కమిషన్-2 అధ్యక్షురాలు జి.వెంకటేశ్వరి, సభ్యులు రమణబాబు, విజయదుర్గ తీర్పునిచ్చారు. ఫిర్యాది నుంచి తీసుకున్న సొమ్మును వడ్డీతో సహా వాపస్ చేయాలని, అదనంగా లక్ష రూపాయల పరిహారం చెల్లించాలని కూడా వారు తమ తీర్పులో స్పష్టం చేశారు. ఫిర్యాది తరపు న్యాయవాది ఎస్.ఎ స్.ఎస్.జగన్నాథరావు బుధవారం తెలిపిన వివరాలివి. చినగంట్యాడ ప్రాంతానికి చెందిన ఎస్.శేషుకుమారి 2019లో బీహెచ్‌పీవీ ప్రాంతానికి చెందిన డి.డి.కన్‌స్ట్రక్షన్స్ సంస్థ నుంచి నాలుగు లక్షల 50 వేల రూపాయలకు ఇంటి స్థలాన్ని కొనుగోలు చేశారు. అదే సంస్థతో ఆ స్థలంలో ఇంటిని సంవత్సర కాలంలో నిర్మించి అప్పగించడానికి రూ.11,82,000కు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒప్పందంలో భాగంగా ఫిర్యాది పలు దఫాలుగా రూ.10,24,900 చెల్లించారు. మూడేళ్లు గడిచినప్పటికీ, ప్రతివాది రూ.7,15,018 విలువ కలిగిన నిర్మాణ పనులను మాత్రమే పూర్తి చేశారు. రూ.3,09,991 విలువ చేసే పనులు ఇంకా చేయవలసి ఉంది. లీగల్ నోటీసు జారీ చేసినా ప్రయోజనం లేకపోవడంతో ఫిర్యాది వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. ఇరు పక్షాల వాదనలు, సాక్ష్యాధారాలను పరిశీలించిన కమిషన్.. ప్రతివాది సేవా లోపంను గుర్తించి, పై విధంగా తీర్పునిచ్చింది.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఫార్మా ఉద్యోగి మృతి

అనకాపల్లి టౌన్: రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రావికమతం మండలం గుడ్డిపా గ్రామానికి చెందిన కోరుకొండ గణేష్(28) పరవాడ ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ప్రతి రోజులాగే గత నెల 30న ఉదయం స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై పరవాడ బయలు దేరాడు. మార్గం మధ్యలో కూడ్రం గ్రామం సమీపంలో రోడ్డుపై మలుపు తిప్పేటప్పుడు వాహనం అదుపు తప్పి సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొని కింద పడిపోయాడు. వెంటనే అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి ఆయనను తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. మృతుడు అవివాహితుడు. మృతుడు తండ్రి సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అప్పన్న సన్నిధిలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

సింహాచలం: సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామిని బుధవారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి పి.శ్రీసుధ దర్శించుకున్నారు. ఆలయంలో కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించారు. ఏఈవో తిరుమలేశ్వరరావు ఆలయ సంప్రదాయం ప్రకారం ఆమెకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

భలే మందుస్తు ఏర్పాట్లు



దసరా వచ్చిందంటే చాలు... చాలామందికి మందు, ముక్క లేకుండా పండగ అస్సలు మొదలైనట్టే కాదు.. ఈ రెండూ ఉంటేనే ఆ రోజుకి అసలు 'జోష్' వచ్చినట్టు. ఈ ఏడాది అసలు ట్విస్ట్ ఏంటంటే... దసరా పండగ సరిగ్గా గాంధీ జయంతి రోజునే వచ్చింది. 'నియమం' ప్రకారం, ఈ శుభదినాన ప్రభుత్వం మద్యం దుకాణాలు, మాంసం దుకాణాలు రెండింటికీ సెలవు ప్రకటించింది. అంటే పండగ రోజున మందు బాబుల 'హోమ్ డెలివరీ'కి కూడా దారి లేదన్నమాట..'ఏం? పండగని ఆపేస్తారా? మా ఆనందాన్ని ఆపగలరా?' అంటూ మద్యం ప్రియులు రంగంలోకి దిగారు. గురువారం షాపులు మూతపడతాయని తెలియగానే, బుధవారాన్ని వాళ్లు 'అంతర్జాతీయ అత్యవసర నిల్వల దినోత్సవం' గా మార్చేశారు. వైన్‌షాపుల ముందు క్యూ చూస్తే, అంతా తమ ఇళ్లలో కనీసం నెల రోజులకు సరిపడా 'ద్రవ్య నిల్వలు' పెట్టుకోవడానికి వచ్చినట్టు అనిపించింది. వీళ్ల ప్రణాళిక చూసి చాలా మంది ముక్కున వేలేసుకున్నారు. వైన్‌షాపుల ముందు గుమిగూడిన జనాన్ని చూసి, పక్కన ఉన్నవాళ్లంతా దసరా జోష్ అంటే ఇదే కదా.. అంటూ చమత్కరించారు. ఇక మాంసం దుకాణాల వద్ద రద్దీ అయితే ఇంకో లెవల్.. మటన్, చికెన్ ముక్కలు కొని, పాడవకుండా ఉండేందుకు 'ఐస్ క్యూబ్ ప్లానింగ్' ఎలా చేయాలో ఒకరికొకరు సలహాలు ఇచ్చుకున్నారు. 'ముక్కను ఫ్రిజ్‌లో దాచడం ఒక కళ, దాన్ని సేఫ్‌గా పండగ రోజు వరకూ ఉంచడం ఒక విజ్ఞానం' అంటూ డిస్కషన్లు పెట్టుకున్నారు. –సీతంపేట(విశాఖ)

ఆస్పత్రి భవనం ప్రారంభం సరే.. వసతులేవి?

- మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- మాడుగుల సీహెచ్‌సీ భవనం సందర్శన

మాడుగుల: వైఎస్సార్ సీపీ హయాంలో నిర్మించిన మాడుగుల సీహెచ్‌సీ భవనాన్ని మౌలిక వసతులు కల్పించకుండా ప్రారంభించడంపై మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తప్పుబట్టారు. ఈ మేరకు బుధవారం స్థానిక 30 పడకల నూతన ఆస్పత్రి భవనంలోని వార్డులతో పాటు ఆపరేషన్ థియేటర్‌ను ఆయన సందర్శించారు. అనంతరం బూడి విలేకరులతో మాట్లాడుతూ సీహెచ్‌సీ భవనం పనులు దాదాపు 90 శాతం 2024లో ఎన్నికల ముందే పూర్తయ్యాయన్నారు. ప్రస్తుతం కూటమి ప్రజాప్రతినిధులు ఆస్పత్రి భవనం ప్రారంభించడమే కాదని, దానిలో మౌలిక వసతుల కల్పనతో పాటు డిప్యూటేషన్‌పై వెళ్లిన వైద్యులను తిరిగి తీసుకువచ్చి నిరుపేద గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ థియేటర్, ఎక్స్‌రే ప్లాంట్‌లను పరిశీలించి మందులు, వైద్యం అందించే తీరును వైద్యాధికారి బి.చంద్రశేఖర్‌ను ఆయన అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో ఉన్న కె.కోటపాడు సీహెచ్‌సీకి రూ. 5.60 కోట్లు, మాడుగుల సీహెచ్‌సీకి రూ. 5.29 కోట్లు తమ హయాంలో మంజూరు చేశామన్నారు.



మాడుగులలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం పాత సీహెచ్‌సీ భవనానికి కనీసం మరమ్మతులు చేపట్టలేదని విమర్శించారు. కూటమి ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి ఉంటే ఈ ఆస్పత్రిని 30 పడకల నుంచి 50 పడకలకు అప్‌గ్రేడ్ చేసి మౌలిక వసతులు కల్పించాలన్నారు. పాత ఆస్పత్రి భవనంలో మార్చురీ విభాగం ఏర్పాటు చేస్తామని వైద్యులు సూచించడం బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్, సర్పంచ్ ఎడ్ల కళావతి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, కోఆప్షన్ మెంబరు షేక్ ఉన్నీషా, ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు, తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్‌కే బార్‌లో మద్యం అక్రమ నిల్వలు

యలమంచిలి రూరల్: పట్టణంలోని ప్రధాన రహదారి పక్కనున్న ఏఆర్‌కే బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం అక్రమ నిల్వలను యలమంచిలి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ బార్‌కు సంబంధంలేని నంబర్లతో ఉన్న 10 మద్యం సీసాల కేసులు, 8 బీరు సీసాల కేసులను గుర్తించినట్టు జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి వి.సుధీర్ తెలిపారు. ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బంది బార్‌లో తనిఖీలు చేయగా అక్రమంగా నిల్వ చేసిన మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయన్నారు. పట్టుబడిన మద్యం బాటిళ్లలో వివిధ బ్రాండ్లు ఉండడంతో ఒక్కో బ్రాండ్‌కు ఒకటి చొప్పున శాంపిళ్లను రసాయన విశ్లేషణ నిమిత్తం ప్రయోగశాలకు పంపించినట్టు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై యలమంచిలి అబ్కారీ శాఖ స్టేషన్‌లో క్రైం నెంబరు 69/2005తో కేసు నమోదు చేశారు. మంగళవారం రాత్రి ఈ బార్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన అధికారులు స్టేషన్‌కు చెందిన బొలెరో వాహనంలో మద్యం సీసాలు, బీర్లను తీసుకెళ్లారు. అయితే ఈ విషయం బుధవారం సాయంత్రం వరకు మీడియాకు తెలీకుండా రహస్యంగా ఉంచడం పలు విమర్శలకు తావిచ్చింది.



ఏఆర్‌కే బార్ అండ్ రెస్టారెంట్‌లో ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వామికి సహస్రనామార్చన విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 1001నామాలతో స్వామికి అర్చన జరిపారు. విశేషంగా హారతులు ఇచ్చారు. భక్తులకు తులసి ప్రసాదాన్ని అందజేశారు.

ఘనంగా నిత్యకల్యాణం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, అక్షింతలు, ప్రసాదం అందజేశారు.



జీలకర్రబెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

గుణుపూర్ పాసింజర్‌కు అదనపు కోచ్

తాటిచెట్లపాలెం: దసరా వేళ ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖపట్నం-గుణుపూర్-విశాఖపట్నం పాసింజర్‌కు అదనంగా జనరల్ క్లాస్ కోచ్‌ను తాత్కాలికంగా జతచేస్తున్నారు. గురువారం నుంచి ఈ నెల 5వ తేదీ వరకు ఈ సదుపాయం ఉంటుందని, ప్రయాణికులు వినియోగించుకోవాలని రైల్వే అధికారులు కోరారు.

మహాలక్ష్మిగా కనకమహాలక్ష్మి



హారతులందుకుంటున్న కనకమహాలక్ష్మి భక్తులు

డాబాగార్డెన్స్(విశాఖ): శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం శరన్నవరాత్రి మహోత్సవాలతో ఆధ్యాత్మిక కాంతులీనుతోంది. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు భక్తులను మహాలక్ష్మి అలంకరణలో కటాక్షించారు. పలు రకాల తాజా కూరగాయలతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించి వేద పండితులు శాస్త్రోక్తంగా సహస్రనామాచార్చన నిర్వహించారు. నగరానికి చెందిన భక్తులు ఒ.నరేష్ కుమార్, రాధిక కుటుంబ సభ్యులు రూ.45 వేలు చెల్లించి పూజలో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. గురువారం అమ్మవారు స్వర్ణకవచాలంకరణలో దర్శనమివ్వనున్నారని, 108 స్వర్ణపుష్పాలతో ప్రత్యేక పుష్పార్చన నిర్వహిస్తామని ఈవో శోభారాణి తెలిపారు.

పద్మావతిగా కన్యకాపరమేశ్వరి

డాబాగార్డెన్స్: పాతనగరం కురుపాం మార్కెట్ సమీపంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 10వ రోజు బుధవారం కన్యకాపరమేశ్వరి పద్మావతిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థాన ప్రధాన అర్చకుడు ఆర్ బీబీ కుమార్‌శర్మచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన వాసవీ కనకదుర్గాదేవికి ప్రత్యేక కుంకుమ పూజలు, హోమం చేశారు. సత్యవతి, వెంకటేశ్వర సుందరకాండ గ్రూప్‌చే సుందరకాండ గానం భక్తులను అలరించింది. గురువారం కన్యకా పరమేశ్వరి విజయదుర్గాదేవిగా దర్శనమివ్వనున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.



పద్మావతిగా భక్తులకు దర్శనమిస్తున్న కన్యకాపరమేశ్వరి



భీమిలి శివారులో పంచదార చిలకల అలంకరణలో..



బీచ్‌రోడ్డులోని కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం బుధవారం పర్యాటకులతో కిటకిటలాడింది. నగరం నుంచే కాకుండా, ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివచ్చి మ్యూజియాన్ని తిలకించారు. -ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్లుప్తంగా

కనకదుర్గమ్మను దర్శించుకున్న అమర్‌నాథ్



కనకదుర్గమ్మను దర్శించుకున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో దసరా ఉత్సవాలు నిర్వహించుకోవాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మను బుధవారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ ఆయన్ను శాలువాతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాలుగా సతకంపట్టు కనకదుర్గమ్మ ఉత్సవాలు వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, వైఎస్సార్‌సీపీ 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, గవర కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, మాజీ కౌన్సిలర్ దాడి నారాయణరావు, పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఈవ్ టీజర్లకు కౌన్సెలింగ్

కశింకోట: ఈవ్ టీజర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని అనకాపల్లి సబ్ డివిజన్ శక్తి టీం ఇన్‌చార్జి పి. మనోజ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు రహదారులు, విద్యా సంస్థలు, బహిరంగ స్థలాల్లో మహిళలు, బాలికలు భద్రంగా సంచరించేందుకు తమ బృందం కృషి చేస్తోందన్నారు. దీనిలో భాగంగా మహిళలు, బాలికల పట్ల ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. నిరంతర గస్తీలు, అవగాహన కార్యక్రమాలు, ఫిర్యాదులు చేసిన వెంటనే స్పందించడం వంటి చర్యలు చేపడుతున్నామన్నారు. తద్వారా మహిళలు, బాలికలకు సమాజంలో సురక్షితమైన, గౌరవ ప్రదమైన వాతావరణాన్ని కల్పించాలనే లక్ష్యంతో బృందం పని చేస్తోందన్నారు.

కుళాయిల మరమ్మతులు చేపట్టండి



ఏఎంసీ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి టౌన్: పట్టణంలోని విజయరామరాజుపేట ఏఎంసీ కాలనీని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పరిశీలించారు. కాలనీలో మంచినీటి కుళాయిల మరమ్మతులు తక్షణమే చేపట్టాలన్నారు. కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభించాలని జోనల్ కమిషనర్ చక్రవర్తిని కోరారు. పీహెచ్‌సీని సందర్శించి అక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. నాయకులు ఎస్ భానుచందర్, బొద్దపు ప్రసాద్, మంగా ఈశ్వర్ పాల్గొన్నారు.

అమ్మవు నీవే... అఖిల జగాలకు..



కనకదుర్గ అమ్మవారు అలంకరణలో గౌరీదేవి



కశింకోటలోని శివాలయంలో కాళికాదేవిగా సర్వమంగళాంబ



కశింకోట జాతీయ రహదారి వద్ద మహిషాసుర మర్దినిగా కనకదుర్గ



అంజియ్యకాలనీలో కనకదుర్గమ్మను దర్శించుకున్న కార్పొరేటర్ మందపాటి సునీత జానకీరామరాజు దంపతులు

• నేడు విజయదశమికి ఏర్పాట్లు

అనకాపల్లి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్ల దేవాలయాల్లో పదో రోజు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ అవతారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు.

• స్థానిక సతకంపట్టు కనకదుర్గమ్మవారు..మహిషాసుర మర్దినిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి చంద్రశేఖర్, భోగారపు వెంకటరమణల ఆధ్వర్యంలో ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. భవానీభక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని చేపట్టారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై పట్టణ పురవీధుల్లో ఊరేగించారు.

• స్థానిక నిదానందొడ్డి కామాక్షిదేవి ఆలయంలో అమ్మవారిని భద్రకాళీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక మెయిన్‌రోడ్డులో కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని విశేష అలంకరణ చేశారు.

• స్థానిక గవరపాలెం నూకాంబిక బాలాలయంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, రాత్రి ఊంజల్ సేవా కార్యక్రమాన్ని అర్చకులు చేపట్టారు. వెంపరాల సుబ్రహ్మణ్య శర్మ సత్యవాణి, మళ్ల జగ్గప్పారావు మోహిని దంపతులు ఆర్థిక సాయంతో భవానీ భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని చేపట్టారు.

• స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన దేవాలయంలో గౌరీదేవి కనకదుర్గ అలంకరణలో దర్శనమిచ్చారు. ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు.

• మండలంలో సత్యనారాయణపురం కొండపై కనకదుర్గమ్మకు మహిషాసురమర్దినీదేవిగా అలంకరించారు. ఆలయ చైర్మన్ కోటిపల్లి కిషోర్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 1500 మందికి అన్నసమారాధన కార్యక్రమాన్ని చేపట్టారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కొండపై దేవాలయ మండప వీధుల్లో ఊరేగించారు.

స్థానిక 82వ వార్డు పరిధిలో అంజియ్యకాలనీలో కనకదుర్గమ్మను 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకీరామరాజు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, నాయకులు ఆకుల సంతోష్, కోన ఉమా, డొంక సత్తిబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కశింకోట: దసరా ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. స్థానిక జాతీయ రహదారి వద్ద కనకదుర్గ ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్దిని దేవిగా భక్తులకు బుధవారం దర్శనమిచ్చారు. ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. కొందరు భవానీ భక్తులు మాలలను త్యజించారు. తల నీలాలు అర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక శివాలయంలో సర్వమంగళాంబను కాళికాదేవిగా అలంకరించి కుంకుమార్చనలు నిర్వహించారు. స్థానిక గవరపేట మధ్య వీధిలో దుర్గాదేవి మండపం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. గురువారం విజయదశమి సందర్భంగా దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనోత్సవం నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు.



భద్రకాళిదేవి అవతారంలో కామాక్షిదేవి అమ్మవారు



నూకాంబిక ఆలయంలో అన్నసమారాధన



మాలలు త్యజిస్తున్న భవానీ భక్తులు

ఫార్మా కార్మికులకు 20 శాతం బోనస్ చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గనిశెట్టి

పరవాడ: దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఫార్మా కార్మికులకు 20 శాతం బోనస్ చెల్లించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఫార్మాసిటీలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పండగల బోనస్‌ను అక్టోబరు జీతంతో కలిపి చెల్లించాలని డిమాండ్ చేశారు. బోనస్ అనేది కార్మికులకు బకాయి పడిన వేతనమని, యాజమాన్యాలు ఇష్టానుసారంచెల్లించేది కాదన్నారు. గతంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి బోనస్‌ను సాధించుకున్నారని తెలిపారు. పోరాడితే తప్పా కొన్ని ఫార్మా పరిశ్రమలు బోనస్‌ను చెల్లించడం లేదని చెప్పారు. బోనస్ అమలు జరిగే విధంగా కార్మిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్ని ఫార్మా పరిశ్రమలు 20 శాతం బోనస్‌ను కచ్చితంగా చెల్లించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

శానిటరీ సిబ్బందికి హాట్‌బాక్స్‌ల పంపిణీ



శానిటరీ సిబ్బందికి హాట్‌బాక్స్‌లు, మిఠాయిలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సునీత జానకీరామరాజు

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో విజయదశమి నిర్వహించుకోవాలని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత తెలిపారు. స్థానిక నర్సింగరావుపేట తమ స్వగృహంలో వార్డు పరిధిలో జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు బుధవారం హాట్‌బాక్స్‌లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డు పరిధిలో ప్రజలు వ్యాధులు బారిన పడకుండా నిత్యం పరిసరాలను పరిశుభ్రంగా చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు అందుబాటులో ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హైమావతి

మునగపాక: ఆస్పత్రికి వచ్చే రోగులకు సిబ్బంది అందుబాటులో ఉంటూ వారికి సేవలందించాలని డీఎంహెచ్‌వో ఎం.హైమావతి ఆదేశించారు. మండలంలోని చూచుకొండ ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం ఆమె సందర్శించారు. ఆస్పత్రిలోని రికార్డులు పరిశీలించారు. వ్యాక్సిన్ నిర్వహణ, ల్యాబ్, మందుల గదులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆస్పత్రిలో ప్రసవాలకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరమైన కార్యక్రమాలు విజయవంతం చేయాలన్నారు. డాక్టర్ వై.రామకృష్ణ, లక్ష్మీనారాయణ, హెల్త్ ఎక్స్‌టెన్షన్ అధికారి గుర్రం శ్రీనివాసరావు, ఆరోగ్య సూపర్‌వైజర్ బేగం, టెక్నీషియన్ పాల్గొన్నారు.

సంతలో నాటుకోళ్లకు గిరాకీ

కె.కోటపాడు: చౌడువాడ గ్రామంలో బుధవారం జరిగిన వారపుసంతలో నాటుకోళ్ల ధరలకు రెక్కలొచ్చాయి. విజయదశమి పర్వదినం సందర్భంగా నాటుకోళ్ల కోసం పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు సంతకు వచ్చారు. 2 కిలోల బరువు గల కోడిపుంజుల ధర ఒక్కొక్కటి రూ.1500 నుంచి రూ.2వేల వరకూ పలికాయి. ధరలు పెరిగినా పండగ నేపథ్యంలో కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. దీంతో నాటుకోళ్ల అమ్మకాల వద్ద సందడి నెలకొంది.



కశింకోట పీహెచ్‌సీ వైద్యురాలిగా మానస



కశింకోట: స్థానిక పీహెచ్‌సీకి ప్రత్యామ్నాయ వైద్యురాలిగా మానస బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పీహెచ్‌సీలో పని చేస్తున్న వైద్యులు తిరుపతిరావు, యశోద రాష్ట్ర వ్యాప్త సమ్మెలో పాల్గొన్న నేపథ్యంలో అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వ ఆస్పత్రి క్యాజువాలిటీ విభాగం వైద్యురాలు మానసను నియమించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీకి 70 మంది రోగులు హాజరయ్యారు. వారిలో ఎక్కువగా సాధారణ జ్వరపీడిత రోగులు ఉన్నారని తెలిపారు. వారితోపాటు అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు.

ఎరువులపై జీఎస్టీ తగ్గింపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రామ్మోహనరావు

అనకాపల్లి: ఎరువులపై 18 శాతం నుంచి 5 శాతానికి జీఎస్టీ తగ్గిందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రామ్మోహనరావు తెలిపారు. మండలంలో మార్టూరు పంచాయతీ వద్ద జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమం పోస్టర్‌ను ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీఎస్టీ 2.0 కారణంగా పశుఔషధాల ధరలు తగ్గాయని, డయాగ్నస్టిక్ కిట్‌లతో సహా 10 రకాల పశువైద్య ఉత్పత్తులపై జీఎస్టీని 5 శాతం నుంచి సున్నాకి తగ్గిందన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సౌజన్య, వైద్యులు అనీల్‌కుమార్, గౌతమ్ వర్మ, కుమారి, సర్పంచ్ కరణం వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ -02 ప్రకారం వస్తువుల విక్రయాలు



జీఎస్టీ శాతం తగ్గింపుపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖరరావు

కశింకోట: ప్రభుత్వం పలు రకాల నిత్యావసర, ఇతర వస్తువులపై జీఎస్టీ శాతం తగ్గించిందని, దీనివల్ల వాటి ధరలు తగ్గాయని ఎంపీడీవో సీహెచ్ చంద్రశేఖరరావు తెలిపారు. బుధవారం స్థానిక గవరపేటలో ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై ప్రజలతో మమేకమై అవగాహన కలిగించారు. జీఎస్టీ తగ్గించిన మేరకు వస్తువులను విక్రయించాలని, లేదంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది రాజు, నారాయణ, చిన్న తదితరులు పాల్గొన్నారు.